సాక్షి శ్రీకాకుళం

శనివారం ◆ 1 ◆ జూన్ ◆ 2024



ఫిట్‌గా ఉండాల్సిందే..

స్కూల్‌బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందే. లేదంటే చర్యలు తప్పవని అధికారుంటున్నారు. - 10లో



డ్రిల్.. థ్రిల్

టెక్కలిలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. అల్లర్లు జరిగితే ఎలా అరికట్టాలో చూపించారు. - 10లో

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలతో పాటు సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని జిల్లా పరిషత్ సీఈఓ డి.వెంకటేశ్వరరావు తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

'పొగాకు వినియోగ వ్యతిరేక కార్యక్రమాలకు ప్రణాళిక'

అరసవల్లి: పొగాకు వినియోగంతో ఎన్నో రకాల నష్టాలున్నాయని, క్యాన్సర్ కారకంగా ఉన్న ఈ పొగాకు వినియోగంపై రానున్న 20 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పొగాకు వినియోగానికి వ్యతిరేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. పొగాకు వినియోగాన్ని పూర్తిగా నియంత్రించే దిశగా ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని, వీటికి అనుగుణంగా వ్యూహాత్మక కార్యాచరణ సిద్ధం చేయాలని సంబంధిత విభాగాధికారులకు ఆదేశించారు. పొగాకు ఉత్పత్తుల చట్టం-2023 ప్రకారం ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అడిషినల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రసాదరావు, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ శ్రీదేవి, డీపీఎంఓ డాక్టర్ లక్ష్మీ, డెమో పైడి వెంకటరమణ, డీసీఎం రవిప్రసాద్ తదితరులున్నారు.

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ కొలువు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్ఐఓ పి.దుర్గారావు. పక్కనే యోగేష్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించే గొప్ప అవకాశం ప్రస్తుత విద్యార్థులకు లభించడం గొప్ప అవకాశమని ఇంటర్ బోర్డు జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు అన్నారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా జరిగింది. నాన్ మ్యాథ్స్ కోర్సుల్లో 750 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి ఔత్సాహికులు హాజరయ్యారు. బాలికలు సైతం జాబ్‌మేళాలో పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని హెచ్‌సీఎల్ సంస్థ రీజనల్ ప్రతినిధి యోగేష్ తెలిపారు. హెచ్‌సీఎల్ సంస్థ నిరుపేద విద్యార్థుల పాలిట వరంగా మారిందని ఆర్ఐఓ దుర్గారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్, గూణ సింహాచలం, కీర్తి తవిటినాయుడు, పి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాల కల్పనపై దృష్టి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఉపాధి హామీ పథకంలో వేతనదారులందరికీ వందరోజుల పనిదినాలు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు ఆదేశించారు. జిల్లాకేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఏపీఓ, టీఏ, ఈసీ పరిశీలిస్తే పనుల్లో నాణ్యత పెరిగి వేతనం రూ.295 చేరుకుంటుందన్నారు. లక్ష్యాల మేరకు మొబలైజేషన్ జరగాలని, 6 నుంచి ఎనిమిది గంటల వరకు చల్లని సమయాల్లో పనులు జరగాలని, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పంటకాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. చెరువుల్లో పూడిక పనులకు అంచనాలు రూపొందించవద్దని, ప్లాంటేషన్, కందకాలు, పంట కాలువలు, ఫిష్ పాండ్స్, భూగర్భ జలమట్టాలను పెంపొందించే పనులను గుర్తించి ఈ నెల ఏడోతేదీలోగా జిల్లా కార్యాలయాలకు ఎస్టిమేషన్లు పంపాలన్నారు. జిల్లాలో ఐదువేల ఇరిగేషన్ చెరువులు ఉన్నాయని, కనీసం మూడువేల చెరువుల్లో ఫిష్‌పాండ్స్ పనులు రెండుమీటర్ల లోతులో చేపట్టాలని, ప్లాంటేషన్‌కు సంబంధించి వ్యక్తిగత తోటలు, మునగ, చెరువు గట్లపై మొక్కలు, సామాజిక వనాలు, రహదారులకు ఇరువైపులా మొక్కల పెంపకాలు వంటి పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు చేపట్టాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారి వి.సతీష్‌బాబు మాట్లాడుతూ కొలతల మేరకు మాత్రమే చెల్లింపులు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు పని జరిగే చోట ఉండేలా టీఏ, ఈసీ, ఏపీఓలు చూడాలని సూచించారు.

తొలకరి పలకరింపు



కోటబొమ్మాళిలో వర్షం

కోటబొమ్మాళి, వజ్రపుకొత్తూరు రూరల్: రోజంతా ఉక్కపోతతో అల్లాడిపోయిన వారికి శుక్రవారం రాత్రి పూట జల్లులు ఉపశమనం కలిగించాయి. కోటబొమ్మాళిలో రాత్రి జల్లులు కురిశాయి. వజ్రపుకొత్తూరు మండలంలోనూ పలు చోట్ల వాన కురిసింది. ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులకు ఈ వాన ఊరటనిచ్చింది.

ఆమె చేతిలోనే ఫలితం



- జిల్లాలో పురుషుల కంటే మహిళల పోలింగే అధికం
- అత్యధికంగా ఇచ్ఛాపురంలో ఓట్లేసిన వనితలు
- ఫలితాలపై ప్రభావం చూపనున్న మహిళా ఓటింగ్



శ్రీకాకుళం పాతబస్టాండ్:

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులతో పాటు జనాల్లోనూ టెన్షన్ పెరుగుతోంది. సమయం సమీపిస్తున్న కొద్దీ ఎవరి విశ్లేషణలు వారు చేసుకుంటున్నారు. అయితే జిల్లా ఫలితాన్ని మాత్రం ఈ సారి అతివలు నిర్దేశించబోతున్నారు. ఈ సారి మహిళలు పురుషుల కంటే అధికంగా ఓటు వేయడంతో మహిళల ఓటు కీలకంగా మారబోతోందని పరిశీలకులు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా మహిళలకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేయడం, అన్ని పథకాల్లోనూ అగ్రతాంబూలం ఇవ్వడం, అన్ని ఆపద వేళల్లో ఆదుకోవడంతో ఆ పార్టీకి మహిళలు అండగా నిలిచారనే విశ్లేషణ అంతటా జరుగుతోంది. ఇచ్ఛాపురంలో మహిళలు పురుషుల కంటే అత్యధికంగా ఓట్లు వేశారు. ఇక్కడ 18,440 మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఓటేశారు. పలాసలోనూ 11,523 ఓట్లు ఎక్కువగా పడ్డాయి.

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే..

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పురుషుల ఓట్లు 84,291 పోలవ్వగా, మహిళల ఓట్లు 1,02,731 పోలయ్యాయి, ఇతరుల ఓట్లు కేవలం రెండే. అంటే 18,440 ఓట్లు మహిళలవి ఎక్కువ పోలయ్యాయి.
- పలాసలో పురుషుల ఓట్లు 76,893 పోల్ కాగా, మహిళలు 88,416 మంది, ఇతరులు ఇద్దరు ఓట్లు వేశారు. అంటే మహిళల ఓట్లు 11,523 ఎక్కువ పోలయ్యాయి.
- టెక్కలిలో పురుషులవి 91,326 ఓట్లు పోల్ కాగా, మహిళల ఓట్లు 95,569, ఇతరుల ఓట్లు రెండు పోలయ్యాయి. 4,243 మహిళల ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి.
- పాతపట్నంలో పురుషులు 78,510 మంది ఓటు వేయగా.. మహిళలు 81,594 మంది ఓటేశారు. ఇతరులు ముగ్గురు వేశారు. ఈ నియోజకవర్గంలో మహిళలు పురుషుల కంటే అధికంగా 3,084 మంది స్త్రీలు ఓటు వేశారు.
- శ్రీకాకుళంలో పురుషులు 90,732 మంది ఓటు వేయగా, మహిళలు 95,925 మంది, ఇతరులు ఒకరు ఓటేశారు. ఇక్కడ మహిళల ఓట్లు 5193 ఎక్కువగా పోలయ్యాయి.
- ఆమదాలవలసలో పురుషులు 76,103 మంది ఉండగా, మహిళలు 78,251, ఇతరులు ముగ్గురు ఓటు వేశారు. మహిళల ఓట్లు ఎక్కువగా 2148 పోలయ్యాయి.
- నరసన్నపేటలో పురుషులు 85,638మంది ఓటు వేయగా, మహిళలు 88,189, మంది, ఇతరులు ఒకరు ఓటు వేశారు. మహిళల ఓట్లు 2551 ఎక్కువగా పోలయ్యాయి.
- ఎచ్చెర్లలో పురుషులు 1,02,681 ఓట్లు వేయగా, మహిళలు 1,01,147 మంది, ఇతరులు ఒకరు ఓటు వేశారు. ఇక్కడ పురుషుల ఓట్లు 1534 ఎక్కువగా పోలయ్యాయి.
- జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే మహిళలు 48,716 ఎక్కువగా ఓట్లు వేశారు.

14 పోలింగ్ బూత్‌లకు ఓ రౌండ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కౌంటింగ్‌కు ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయ్యాయి. కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు వేయడంతో 14 టేబుళ్లలో 14 పోలింగ్ స్టేషన్ల ఫలితాలు ఒకసారి వెలువడుతాయి. ఇలా వెలువడే మొత్తాన్ని ఒక రౌండ్ అంటారు. ఇలా ఆ నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ స్టేషన్లు ఆధారంగా రౌండ్లను నిర్ణయిస్తారు. మన జిల్లాలో ఆమదాలవలస నియోజకవర్గంలో అత్యల్పంగా 259 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. దీంతో ఇక్కడ 19 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. అలాగే పాతపట్నంలో 323 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. దీని ఫలితం 24 రౌండ్లలో వెలువడుతుంది. వీటికి తోడుగా పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లను కూడా ఇదే సమయంలో లెక్కించి ఈవీఎం ఫలితాలకు కలుపుతారు.

నియోజకవర్గం	పీఎస్‌లు	టేబుళ్లు	రౌండ్లు
ఇచ్ఛాపురం	299	14	22
పలాస	284	14	21
టెక్కలి	315	14	23
పాతపట్నం	323	14	24
శ్రీకాకుళం	279	14	20
ఆమదాలవలస	259	14	19
నరసన్నపేట	290	14	21
ఎచ్చెర్ల	309	14	23

కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట భద్రత





వీడియోకాన్ఫరెన్స్‌లో ఎస్పీ రాధిక, అదనపు ఎస్పీలు

- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

శ్రీకాకుళం క్రైమ్ : కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీఐజీ విశాల్ గున్నీ వర్చువల్ విధానం ద్వారా జిల్లా పోలీసులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం తీసుకోవాల్సిన చర్యలు, కౌంటింగ్ కేంద్రాల భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై ముందుగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కౌంటింగ్ రోజున ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేసేవారిని ముందస్తుగా గుర్తించాలని, ఒకే చోట ఎక్కువ ప్రజానీకం గుమిగూడకుండా ఉండేలా చూడాలని, ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతతో పాటు ప్రవేశమార్గం వద్ద ఎలాంటి అనూహ్య ఘటనలు జరగకుండా పికెప్ బృందాలను నియమించాలన్నారు.

రౌడీషీటర్లపై నిఘా..

144 సెక్షన్ మేరకు కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం గస్తీ చేస్తుండాలన్నారు. ముఖ్యంగా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సామాజిక మాధ్యమాల పోస్టులపై ఓ కన్నేసి ఉంచాలని, తప్పుడు ఉదంతాలు, సందేశాల పోస్టులను, అసత్య స్క్రోలింగ్‌లను త్వరితంగా నియంత్రించాలని సూచించారు.

సమస్యాత్మక గ్రామాల్లో..

సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో పికెట్లు, పెట్రోలింగ్ బృందాలు ఏర్పాటు చేయాలని, లాడ్జీలు, హోటళ్లను నిరంతరం తనిఖీ చేసి కొత్త వ్యక్తులు, పాత నేరస్తుల వివరాలపై ఆరా తీయాలన్నారు. కౌంటింగ్ సజావుగా జరిగేలా సీసీ కెమెరాలు, డ్రోన్ విజువల్స్ ద్వారా నిత్యం పర్యవేక్షించాలని, శాంతియుతంగా జరిగేలా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అధికారులకు స్పష్టం చేశారు.



వర్చువల్ విధానం ద్వారా మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

ఎస్పీ మాట్లాడుతూ..

కౌంటింగ్ రోజున శాంతి భద్రతల పరిరక్షణకు క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూఆర్‌టీ) బృందాలు, స్టాటిక్ ఫోర్స్, పికెట్స్, పెట్రోలింగ్ పార్టీలతో పాటు షాడో బృందాలు గ్రామాల్లో అనునిత్యం తిరుగుతాయని ఎస్పీ రాధిక అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న ఘటన జరిగినా తక్షణమే అందుబాటులో ఉన్న ఫోర్స్‌తో అక్కడకు చేరి గొడవలు జరగకుండా నియంత్రించాలన్నారు. ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి ముందస్తు అరెస్టులు చేయాలని, రాజకీయ పార్టీ కార్యాలయాలు, పోటీ చేసే అభ్యర్థుల ఇళ్ల వద్ద ప్రత్యేక పికెట్లు వేసుకోవాలని, లాడ్జీలు, హోటళ్లలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రతి పీఎస్ పరిధిలో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి ఎలాంటి ఘర్షణలు, అల్లర్లకు పాల్పడకుండా శాంతియుతంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

నిరంతర కౌన్సిలింగ్..

రౌడీషీటర్లకు నిరంతరం కౌన్సిలింగ్ నిర్వహించాలని, లెక్కింపు రోజునైనా, తర్వాతైనా జిల్లాలో ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ప్రణాళిక మేరకు పక్కాగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీసీలో అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, గంగాధరం, డీఎస్పీలు శృతి, త్రినాధరావు, విజయ్‌కుమార్, శేషాద్రినాయుడు, సీఐలు పాల్గొన్నారు.

● గోరంత గద



హనుమద్ జయంతి సందర్భంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి గోరంత బంగారు గదను తయారు చేశారు. కేవలం 0.10 మిల్లీ గ్రాముల బంగారం ఉపయోగించి రెండు గంటలపాటు శ్రమించి ఆంజనేయ స్వామిపై భక్తిని చాటుకున్నారు. – కాశీబుగ్గ



● హనుమా..

ఓ కంట మమ్ము కనుమా

హనుమద్ జయంతిని పురస్కరించుకుని సారవకోటలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామిని శుక్రవారం అరటి పళ్లతో అలంకరించారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అరటి గెలలను అందించారు. – సారవకోట

పద్మ అవార్డుల నామినేషన్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ:

రానున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్, భారత ప్రభుత్వం అభ్యర్థన మేరకు.. ఏపీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ విజయవాడ వారు 2023-24 సంవత్సరంలో అర్హత పొందిన క్రీడాకారుల నుంచి పద్మ అవార్డుల కోసం నామినేషన్‌లు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన క్రీడాకారుల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన వారు 2024 ఆగస్టు ఒకటో తేదీ లోగా తమ వివరాలను పద్మఅవార్డ్స్.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ప్రింటౌట్ కాపీలను స్పోర్ట్స్ఇన్ఏపీ ఎట్‌దిరేటాఫ్ జీమెయిల్ లేదా ఇన్సెంటివ్స్.స్కీమ్స్ ఎట్‌దిరేటాఫ్ జీమెయిల్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు డీఎస్‌ఏ కార్యాలయ సమయాల్లో కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద సంప్రదించాలని లేదా 98660 98642 నంబర్‌ను సంప్రదించాలని శ్రీధర్‌రావు సూచించారు.

● కౌంటింగ్ రోజు రెడ్ జోన్ అమలు

ఎచ్చెర్ల క్యాంపస్: కౌంటింగ్ రోజు శివానీ కళాశాల ఆవరణలోని రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్‌జోన్ అమలు చేయనున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.

కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో గార్డులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. భద్రత నిర్వహణ, కౌంటింగ్ రోజు తీసుకోనున్న చర్యలపై ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో సమీక్ష నిర్వహించారు.

● నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కౌంటింగ్‌లో అధికారులు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన కీలక దశకు చేరుకుందని, ఇందుకోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఎవరు ఏయే విధులు నిర్వహించాలన్న దానిపై ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, కౌంటింగ్ సిబ్బంది హాజరు నమోదు, గుర్తింపు కార్డుల జారీ, అంతరాయం లేని విద్యుత్ ఏర్పాటు, ఇతర అనుబంధ ఏర్పాట్లు, నివేదికలు, రౌండ్‌వారీగా ఫలితాల ప్రకటన కోసం ఎవరు ఏ విధులు చేపట్టాలో సమగ్రంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు చెప్పారు. సమావేశంలో జేసీ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

కాలేజీ గంట.. మోగెనంట!



ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల

- 2024-25 విద్యా సంవత్సరం నేటి నుంచి మొదలు
- నేడు పునఃప్రారంభంకానున్న జూనియర్ కళాశాలలు
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం సమీప గ్రామాల్లో క్యాంపెయినింగ్
- ఇప్పటికే 2024-25 వార్షిక క్యాలెండర్ విడుదల చేసిన ఇంటర్మీడియెట్ బోర్డు



ఓ విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జీజేసీ కొయ్యాం కళాశాల అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నూతన విద్యా సంవత్సరం నేటి నుంచి మొదలుకానుంది. జిల్లాలో జూనియర్ కాలేజీలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. పూర్తిస్థాయిలో తెరుచుకోవడంతోపాటు క్లాసులు మొదలుకానున్నాయి. దీంతో కళాశాలల్లో సందడి వాతావరణం నెలకొననుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇప్పటికే ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశిత వార్షిక క్యాలెండర్‌ను సైతం విడుదల చేసింది. 2020 మార్చిలో విజృంభించిన కరోనా వైరస్ (కోవిడ్)తో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ ప్రభుత్వ పకడ్బందీ చర్యలతో రెండేళ్ల నుంచి పూర్తిస్థాయిలో గాడిలో పడింది. ఈ ఏడాది 2024లో యథావిధిగా జూన్ ఒకటో తేదీన కళాశాలలు రీ ఓపెన్ కానున్నాయి. జిల్లాలో మొత్తం 168 జూనియర్ కళాశాలలు ఉండగా.. ఇందులో 38 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి.

ఆన్‌లైన్ స్పాట్..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ ఇంటర్మీడియెట్ బోర్డు ఆన్‌లైన్ స్పాట్ వాల్యుయేషన్ పేరిట సరికొత్త సంస్కరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. తాజాగా ముగిసిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంతో ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని లాంఛనంగా ప్రారంభించేలా కసరత్తులు చేస్తోంది. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో స్పాట్ వాల్యుయేషన్ షురూ కానుండగా సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జూన్ ఒకటిన కాలేజీలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కాలేజీల్లో లెక్చరర్లు టైమ్ టేబుల్ ప్రకారం తమ పీరియడ్‌లలో పాఠాలు బోధిస్తూ, అడ్మిషన్ డ్రైవ్ చేస్తూనే తీరిక సమయాల్లో ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్‌లలో ఆన్‌లైన్‌లో మూల్యాంకనాన్ని చేపట్టాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒక రోజులో కనిష్టంగా 30 పేపర్లు, గరిష్టంగా 60 పేపర్లు మించరాదని ఆర్ఐఓ పి.దుర్గారావు వెల్లడించారు.

సర్కారీ కళాశాలల్లో ప్రవేశాలకు..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే అధికారుల ఆదేశానుసారం అడ్మిషన్ డ్రైవ్ (క్యాంపెయినింగ్‌లు) నిర్వహిస్తున్నారు. కళాశాలలకు సమీప ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాడు-నేడు కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలు, ల్యాబ్‌లు, డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా బోధన, నిష్ణాతులైన అధ్యాపకులు, బోధన విధానాలు, ఇంటర్ విద్యతో లభిస్తున్న భవిష్యత్ అవకాశాలను వివరిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో గణనీయంగా అడ్మిషన్లు జరిపేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ కళాశాలలపై ఆసక్తి చూపిస్తున్నారు



ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో పాఠాలు బోధించడంతోపాటు అన్ని వసతులు, సౌకర్యాలతో విద్యను అందించేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. అందుకే ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. అడ్మిషన్ డ్రైవ్‌పై కళాశాలల గ్రామాల్లో క్యాంపెయినింగ్‌లు నిర్వహించాం. కాలేజీల్లో పనిచేస్తూనే అధ్యాపకులు ఆన్‌లైన్ స్పాట్ వాల్యుయేషన్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి(డీఐఈఓ), శ్రీకాకుళం

వార్షిక క్యాలెండర్ అమలు చేయాలి



2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ బోర్డు వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈ క్యాలెండర్ ప్రకారం జూన్ 1 నుంచి అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమవుతాయి. తరగతులు కూడా మొదలవుతాయి. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు పరీక్షల నిర్వహణ, సెలవులు ప్రకటించడం జరుగుతుంది.

– ప్రగడ దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ, శ్రీకాకుళం

అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

టెక్కలి: స్నేహపూర్వకమైన వాతావరణంలో క్రీడలు ఆడాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములు సహజమనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఆదిత్య కళాశాల డైరెక్టర్ మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి సైలానీతో పాటు నిర్వాహకుడు ఎస్.లాల్‌బహదూర్ కళాశాల పీడీ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కళాశాల క్రికెట్ మైదానంతో ఏసీఏ అనుసంధానానికి ఒప్పందం చేసుకునే విధంగా కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు సంప్రదింపులు చేశారు.

మొదటి రోజు తూర్పుగోదావరి జట్టు విజయం

అండర్-19 విభాగంలో మొదటి రోజు శ్రీకాకుళం-తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన 50 ఓవర్ల మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీకాకుళం జట్టు 41.4 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 39.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులతో విజయం సాధించింది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

క్లుప్తంగా

మెగా ఎక్స్‌పో నేడు

శ్రీకాకుళం అర్బన్: యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం శ్రీకాకుళం ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళంలోని సింహద్వారం వద్ద నున్న వెంకటాపురం రీజనల్ కార్యాలయం వద్ద మెగా ఎక్స్‌పో-2024ను నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎంవీ తిలక్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా ఎక్స్‌పో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ వైజాగ్ జోనల్ హెడ్ షాలినీ మెనోన్ హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంక్‌గా ఉందన్నారు. అర్హత కలిగిన ఖాతాదారులకు వెంటనే రుణాలు మంజూరు, అతి తక్కువ వడ్డీకే గృహ, వాహన, విద్య, వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తూ ఖాతాదారుల అభిమానాన్ని చూరగొంటున్నామన్నారు.

సబ్‌జైల్ పరిశీలన



సబ్‌జైలు సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

నరసన్నపేట: స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. జైల్‌లో ఉన్న ఇద్దరు ఖైదీలతో మాట్లాడి సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సదుపాయాలు అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాలపై ఆరా తీశారు. అనంతరం కోర్టు సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట స్థానిక సివిల్ జడ్జి సి.హరిప్రియ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం గ్రామ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలికి చెందిన డి.కుమార్ అనే వ్యక్తి శ్రీకాకుళం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బొప్పాయిపురం వద్దకు వెళ్లే సరికి తన ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడకు చేరుకున్న హైవే సిబ్బంది క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

టిప్పర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన మట్టి టిప్పర్

నరసన్నపేట: మండలం లుకలాం-కోమనాపల్లి రోడ్డులో ఉర్లాం వద్ద మట్టితో వెళ్తున్న టిప్పర్ శుక్రవారం ఉదయం బోల్తా పడింది. అతివేగం కారణంగానే బండి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. రోజూ ఈ ప్రాంతంలో యువకులు, పిల్లలు వాకింగ్, వ్యాయామం చేస్తుంటారు. శుక్రవారం స్థలం మార్చడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సన్యాసి(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన తాడేల సన్యాసి (65) శుక్రవారం వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాల ప్రకారం.. సన్యాసి ఉదయం 9 గంటల సమయంలో పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటలైనా ఇంటికి భోజనం కోసం రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూసేసరికి విగతజీవై పడి ఉన్నారు. ఎండ విపరీతంగా ఉండటంతో పాటు అందుబాటులో ఎవరూ లేకపోవడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఆయనకు భార్య వెంకటమ్మ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గదబపాలెంలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన ఆవుల పాక

జి.సిగడాం: మండలంలోని గదబపాలెంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో లండ పాపయ్యకు సంబంధించిన ఆవుల పాక పూర్తిగా దగ్ధమైంది. ఈ పాకలో తిండి గింజలతోపాటు ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైంది. అయితే మంటల్లో చిక్కుకున్న ఆరు మూగజీవాలను 65 ఏళ్ల వృద్ధుడు లండ పాపియ్య ధైర్యం చేసి మంటల్లోకి దూకి కాపాడారు. వృద్ధుడికి స్వల్పగాయాలయ్యాయి.

డ్రిల్.. థ్రిల్

టెక్కలి వైఎస్సార్ జంక్షన్‌లో జనాలు గుమి గూడారు.. వారి చుట్టూ ఆయుధాలతో పోలీసులు.. ఆందోళనకారులను చెదరగొడుతూ భాష్ప వాయుగోళాల ప్రయోగాలు.. నిరసనకారులపై నీటిని కుమ్మరించడం, పోలీసు తూటాలకు ఓ వ్యక్తి పడిపోవడం, పోలీసులు అత్యవసరంగా వైద్య సిబ్బంది అంబులెన్స్‌ను తీసుకువచ్చి అతడిని తీసుకెళ్లడం.. ఎన్నడూ చూడని దృశ్యాలను చూసి టెక్కలి వాసులు ఆశ్చర్యపోయారు. అయితే ఇదంతా ప్రజల్ని అవగాహన కల్పించేందుకు చేసిన మాక్‌డ్రిల్ అని తెలుసుకుని అంతా ఊపిరి పీల్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే పోలీస్ చర్యలు ఏ విధంగా ఉంటాయో తెలియజేయడానికి టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏఆర్ సిబ్బంది, ఇతర పోలీస్ బలగాలు టెక్కలిలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ రాజా, సీఐ షైడయ్యతో పాటు ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. – టెక్కలి



ఆందోళనకారులను కట్టడి చేస్తున్న పోలీస్ ప్రత్యేక బలగాలు



ఆందోళనకారులపై భాష్పవాయువు ప్రయోగాలు



మాక్‌డ్రిల్‌లో భాగంగా నిరసనలో పోలీస్ కాల్పుల్లో గాయపడిన వ్యక్తిని కాపాడేందుకు వైద్య సిబ్బందితో చేరుకున్న పోలీసులు



ఆందోళకారులను కట్టడి చేసేందుకు గాల్లో కాల్పులు చేస్తున్న పోలీసులు



టెక్కలిలో నిర్వహించిన పోలీస్ మాక్‌డ్రిల్‌లో భాగంగా నిరసన చేస్తున్న ఆందోళనకారులు

ఫిట్‌గా ఉండాల్సిందే..

- 12లోగా స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలి
- పత్రాలు లేకుండా బస్సులు నడిపితే కఠిన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా స్కూల్, కాలేజీ బస్సులు 711
- ఇంతవరకూ ఫిట్‌నెస్ తీసుకున్నవి 310 మాత్రమే

శ్రీకాకుళం రూరల్, వజ్రపుకొత్తూరు:

వేసవి సెలవుల అనంతరం జూన్ 12న స్కూళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్‌పై ఆ శాఖాధికారులు దృష్టి సారించారు. ఆయా యాజమాన్యాలు ఈనెల 12లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చేయించుకోవాలని సూచించారు. బస్సులకు ఏవైనా మేజర్ రిపేర్‌లు ఉంటే వాటిని సరిచేసిన తర్వాతే రోడ్డు మీద తిప్పాలని, ఎలాంటి కాగితాలు లేకుండా బస్సులను నడిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఆర్టీవో అధికారుల బృందం ఈ నెల 15 నుంచి 30 వరకూ ఏక కాలంలో స్కూల్ బస్సులపై దాడులు చేయనుంది. ఒక వేళ బస్సులకు ఏదైనా స్కూల్ యాజమాన్యం ఫిట్‌నెస్ చేయించుకోకపోతే ఆయా బస్సులను సీజ్ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూల్ 711 బస్సులు ఉన్నట్లు ఆర్టీఏ అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటివరకూ కేవలం 310 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఆయా స్కూల్స్, కాలేజీ యాజమాన్యాలు చేయించుకున్నాయి.

పాటించాల్సిన పద్ధతులివీ..

- ప్రతి స్కూల్ బస్సు ఫిట్‌నెస్‌కు సంబంధించి ఆర్‌సి, ఇన్స్యూరెన్స్, టాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా బండిలో ఉంచుకోవాలి. ఇవి ఉంటేనే బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను ఆర్టీఏ అధికారులు జారీ చేస్తారు. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో వీటిని తప్పనిసరిగా చూపించుకోవాలి.



బస్సు డ్రైవింగ్ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

- స్కూల్ బస్సు డ్రైవర్‌కు ఐదేళ్ల డ్రైవింగ్‌లో అనుభవంతో పాటు 60 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఖాకీ యూనిఫారంతోనే బస్సును నడపాలి. కంటి సమస్యలు లేకుండా మెడికల్ సర్టిఫికెట్‌ను సమర్పించాలి.
- ప్రతి బస్సుకు అటెండర్‌ను తప్పనిసరిగా ఉంచాలి.
- బస్సు వేగం గంటలకు 55-60 కిలోమీటర్లు స్పీడ్ ఉండేలా స్పీడ్ గవర్నర్స్ తప్పనిసరిగా చూసుకోవాలి.
- బ్రేక్, హ్యాండ్ బ్రేక్, స్టీరింగ్, టైర్లు, స్పీడో మీటర్ అన్ని కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి.
- బస్సు నుంచి అధిక మోతాదుల్లో బ్లాక్ స్మోక్ రాకుండా చూసుకోవాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరంతో పాటు ఫస్ట్ ఎయిడ్ బాక్సును ఉంచాలి.
- ఆయా స్కూల్ బస్సులపై డ్రైవర్ పేరు, ఫోన్ నంబర్‌ను నమోదు చేయించాలి.
- పేరెంట్స్ కమిటీ ఆమోదించిన స్కూల్ బస్సులను మాత్రమే తిప్పనివ్వాలి.
- విద్యార్థులతో స్కూల్ బస్సు బయలుదేరినపుడు తప్పనిసరిగా డోర్‌లాక్‌ను చేయించాలి.
- స్కూల్ బస్సులను స్కూల్ ఆవరణలోనే ఉంచాలి. రోడ్డు సేఫ్టీ గురించి విద్యార్థులకు వారానికో రోజు అవగాహన కల్పించాలి.



బస్సులను పరిశీలిస్తున్న మోటార్ హెహికల్ ఇన్‌స్పెక్టర్

తనిఖీలు చేస్తాం..

ఈ నెల 12 నుంచి స్కూల్ బస్సులపై ఆర్టీఏ అధికారుల బృందంతో తనిఖీలు చేయనున్నాం. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రోడ్డు మీదకు బస్సులకు అనుమతి ఇస్తాం. ఏమైనా మేజర్ రిపేర్లు ఉంటే అవి పూర్తి చేశాక మాత్రమే వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తాం. పొరపాటున ఏదైనా బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే ఆయా బస్సులపై, స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ నెలాఖరు వరకూ స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ చేస్తాం.

– పీవీ గంగాధర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

సజావుగా పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో పాలీసెట్-2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ర్యాంకు ఆధారంగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ మే 27 తేదీ నుంచి కొనసాగుతోంది. సహాయ కేంద్రంలో శుక్రవారం 59001 నుంచి 75000 ర్యాంకు మధ్య విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 281 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 245 బీసీ,ఓసీ, 36 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నారు. మే 27 నుంచి శుక్రవారం వరకు కౌన్సెలింగ్‌కు 1544 మంది హాజరయ్యారు. శనివారం 75001 నుంచి 92000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. షెడ్యూల్ మేరకు రెండో తేదీ వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుంది. మూడో తేదీన జరగాల్సిన కౌన్సెలింగ్ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆరో తేదీకి వాయిదా పడింది. 7 నుంచి 10 వరకు ఆప్షన్ల ఎంపిక, 11వ తేదీన ఆప్షన్ల మార్పు, 13న సీట్ల అలాట్‌మెంట్‌ల ప్రకటన, 14 నుంచి 19 మధ్య కళాశాలలకు సీట్లు లభించిన విద్యార్థుల రిపోర్టింగ్, 14 నుంచి మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.



సహాయ కేంద్రంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ సంక్షేమ వారధి 'టెంక'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీటీఎఫ్ సీనియర్ నాయకుడు ఎంపీయూపీ స్కూల్ వాడాడ ఆంగ్ల ఉపాధ్యాయుడు టెంక చలపతిరావు ఉపాధ్యాయ సంక్షేమ వారధిగా విద్యా ప్రగతే లక్ష్యంగా పనిచేశారని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు కొనియాడారు. శుక్రవారం స్థానిక ఇందిరా విజ్ఞాన భవన్ వేదికగా టెంక చలపతిరావు ఉద్యోగ విరమణ అభినందన సభ జరిగింది. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ కాలం పాటు ఫెడరేషన్ జిల్లా బాధ్యతల్లో ఉంటూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను అధికారుల దృష్టిలో పెట్టి, వాటి పరిష్కారం అయ్యే వరకు కృషి చేసేవారని గుర్తు ఆయన చేశారు. ఉపాధ్యాయ నాయకునిగా చలపతిరావు చూపిన నిబద్ధత, నిజాయితీ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ తన హయాంలో తాను చేపట్టిన జిల్లా విద్యాభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడంలో ఒక ఉపాధ్యాయ సంఘ నాయకునిగా చలపతిరావు అందించిన సహకారం మరువలేనని సంతోషం వ్యక్తంచేశారు. టెంక చలపతిరావు మాట్లాడుతూ తన అభివృద్ధికి, ఎదుగుదలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



టెంక చలపతిరావు ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

ఏపీ డీఈఈ సెట్‌లో సత్తా చాటిన సాత్విక్

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు వెంకయ్యపేటకు చెందిన బగాన సాత్విక్ ఏపీ డీఈఈ సెట్‌లో బయాలజీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించినట్లు సాయిరాం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. బయాలజీ విభాగంలో 100 మార్కులకు గాను 73 మార్కులు సాధించి రెండో ర్యాంకు పొందాడు. విద్యార్థి తల్లిదండ్రులు అరుణ రామారావు ప్రభుత్వ ఉద్యోగులు.



బగాన సాత్విక్

కిడ్నీ ఆస్పత్రిలో మరో ఆపరేషన్

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌లో శుక్రవారం ఓ చిన్నారికి అపెండిక్స్ ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఆస్పత్రిలో కేవలం కిడ్నీ వ్యాధిగ్రస్తులకే కాకుండా అందరికీ సేవలు అందిస్తామని వైద్యులు చెబుతున్నారు. కాశీబుగ్గకు చెందిన పదేళ్ల లెనిన్ అనే బాలుడు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చాడు. వైద్య పరీక్షలు అనంతరం అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి ఉండటంతో ప్రముఖ సర్జన్లు డాక్టర్ కూర్మారావు, డాక్టర్ సురేష్‌లు సంయుక్తంగా అపెండిక్స్ పేగులో పేరుకుపోయిన వ్యర్థాన్ని ఆపరేషన్ చేసి తొలగించారు.

దీంతో తీవ్రమైన కడుపు నొప్పి నుంచి చిన్నారి బయటపడ్డాడు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ జరగడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

'రైతు ఉత్పత్తిదారుల కంపెనీలతో మేలు'

బూర్జ:

రైతు ఉత్పత్తి దారుల కంపెనీ వల్ల రైతులకు మేలు జరుగుతుందని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నాబార్డు డీడీఎంలు టి.నాగార్జున, రమేష్ కృష్ణ తెలియజేశారు. శుక్రవారం పెద్దపేట ఆర్ష్ స్వచ్ఛంద సంస్థలో రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సీఈఓలు, అకౌంటెంట్‌లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీడీఎంలు మాట్లాడారు. పెద్దపేట ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారుల కంపెనీలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలతోపాటు చిన్న, సన్న కారు రైతులకు మార్కెటింగ్ సదుపాయాలతోపాటు గిడ్డంగి సదుపాయాలు, ఎరువులు, ఇన్‌పుట్ సదుపాయం అందుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల ఎఫ్‌పీఓలు, ఏఎస్ఆర్‌లు, సీపీఎఫ్ ప్రతినిధులు, సీఈఓలు నూక అనూప్, బి.శంకరరావు, ఆర్ష్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పెద్దపేట ఆర్ష్ స్వచ్ఛంద సంస్థలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం నాగార్జున

రిమ్స్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వామినాయుడు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, వైద్యాధికారులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ ఎల్.ప్రసన్నకుమార్, డాక్టర్ డి.పార్వతితో పాటు పలువురు వైద్యులు సత్కరించారు. అనంతరం స్వామి నాయుడు మాట్లాడుతూ వైద్యునిగా ప్రజా సేవ చేసే భాగ్యం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన స్థానంలో డాక్టర్ ఉమామహేశ్వరరావును ప్రభుత్వం ఇన్‌చార్జిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు పంపించింది. అయితే ఆయన ఆ బాధ్యతలు తీసుకోకుండా సెలవులో వెళ్లిపోయారు. దీంతో తర్వాత సీనియర్ వైద్యుడిని ఇన్‌చార్జిగా నియమించగా ఆయన సైతం బాధ్యతలు తీసుకోవడానికి నిరాకరించి సెలవుపై వెళ్లిపోయారు. ఇలా ఆరుగురు వైద్యులు బాధ్యతలు తీసుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో ఇన్‌చార్జి లేకుండానే జూన్ 1 నుంచి రిమ్స్ ఆస్పత్రి పనిచేసే పరిస్థితి ఏర్పడింది.



స్వామినాయుడును సత్కరిస్తున్న దృశ్యం

23 మంది యువతులకు శిక్షణ

కాశీబుగ్గ: ఆడపిల్లలకు ఉత్తమ సంస్కారాలతో పాటు భారతీయత, దేశభక్తి, సెల్ఫ్ డిఫెన్స్, లీడర్‌షిప్, సమాజంపై పూర్తి అవగాహణ కల్పించేందుకు నిర్వహించిన శిక్షణకు పలాసకు చెందిన 23 మంది యువతులు హాజరయ్యారు. శ్రీకాకుళం దరి గాయత్రి కళాశాలలో ఏడు రోజులు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

ఇంటిలో చోరీ

సారవకోట: మండలంలోని బుడితి జంక్షన్‌కు సమీపంలో ఉన్న పంచిరెడ్డి నారాయణరావు ఇంటిలో గురువారం దొంగలు పడ్డారు. నారాయణరావు తన భార్య లలిత ఇద్దరు పిల్లలతో కలసి తీర్థయాత్రలకు వెళ్లారు. ఆరుబయట ఉన్న మొక్కలకు నీళ్లు పోయాలని పక్కనున్న వారికి చెప్పడంతో వారు శుక్రవారం ఉదయం మొక్కలకు నీళ్లు పోసేందుకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్ తిరగడం గమనించి వెళ్లి చూశారు. తలుపుల తాళాలు పగలగొట్టి ఉండటం గుర్తించి స్థానిక జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సారవకోట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంటిలో రూ.2 లక్షల వరకు నగదు, అర తులం సాయిబాబా ఉంగరం పోయినట్లు బాధితులు తెలిపారు. సారవకోట ఎస్ఐ అప్పారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. గత నెలలో బుడితి గ్రామంలో ఇలాగే దొంగతనం జరిగింది.



బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ అప్పారావు

సేవలు అమోఘం



సన్మాన గ్రహీతలతో ఎస్పీ రాధిక, అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు, విభాగానికి గుర్తుండిపోయేలా సేవలందించడం అమోఘమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన స్పెషల్ బ్రాంచి ఎస్ఐలు ఎన్.నారాయణ, కె.కృష్ణారావు, ఏఆర్ ఎస్ ఎస్.అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ బి.వాసుదేవ్, కె.రాంబాబులను ఎస్పీ వారి కుటుంబాలతో సహా ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.